



లెక్క తప్పితే.. చిక్కులే..!

- సర్కార్‌కు రిజర్వేషన్ల చిక్కుముడి
- ఇప్పటికే 56 శాతం దాటేసింది..
- తెలంగాణ ప్రభావంతో బెంబేలు
- నవంబరు మొదటి వారంలో హైకోర్టు తీర్పు
- స్థానిక ఎన్నికల పైనే దృష్టి

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లయ్యింది. వర్గీకరణ ద్వారా రిజర్వేషన్లు కేటాయించి దశాబ్దాలకాలంగా ఉన్న ఎస్సీ కులాల మధ్య ఉన్న ఒత్తిడినుంచి తగ్గించుకుందామని ప్రభుత్వం భావించింది. అయితే రిజర్వేషన్ల పెంపు అనేది పెనుసవాల్‌గా మారుతోంది నవంబరు మొదటి వారంలో హైకోర్టులో రిజర్వేషన్లకు సంబంధించిన తీర్పు వెలువడే అవకాశం ఉంది. అధికారులు భవిష్యత్తులో ఎటువంటి సవాళ్లు ఎదుర్కొనాల్సి వస్తుందోనని ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది.

రాష్ట్రంలో కుల వర్గీకరణ జరిపిన తర్వాత ఎస్సీలకు 17శాతం, ఎస్టీలకు 7శాతం, ఇతర ఓబీసీ కులాలకు 32శాతంగా ఖరారు చేశారు. దీంతో రిజర్వేషన్ల శాతం 56శాతంగా ఉంది. ఇటీవల రాష్ట్రప్రభుత్వం ఎస్సీ వర్గాల్లోని 17శాతం రిజర్వేషన్లు వర్గీకరణ ద్వారా వివిధ అనుబంధ కులాలకు వర్తించేలా నిర్ణయించారు. వర్గీకరణ అమలు చేసిన విధానంగానే ఉద్యోగ నియామకాల ప్రక్రియను ప్రారంభించారు. వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి అర్జీలు స్వీకరిస్తోంది. 17శాతం వర్గీకరణతో కలిపితే రిజర్వేషన్లు 56శాతం కానున్నాయి. 384 కేఏఎస్ గెజిటెడ్ ప్రొబేషనరీ నియామకాలకు ప్రక్రియ జరిపారు. అయితే దీనిపై కర్ణాటక అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ అభ్యంతరం తెలిపింది. ట్రిబ్యునల్ సంపూర్ణ నియామకాలకు గెజిట్‌ను రద్దు చేయలేదు, కానీ వర్గీకరణను మాత్రమే రద్దు చేసింది. 2025 మే 25న అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఆదేశాలను వ్యతిరేకిస్తూ హైకోర్టులో ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ఈ వివాదాన్ని త్వరితగతిన పరిష్కరించాలని రెండుసార్లు మెమో జారీ చేసింది. అందుకు అనుగుణంగా ధర్మాసనం జూలై 8న విచారణకు స్వీకరించింది. అయితే న్యాయమూర్తి ఆ విచారణ నుంచి వెనుకడుగు వేశారు. ఆ తర్వాత జూలై 31న విచారణ జరిగింది. 2022 డిసెంబరు 25న ప్రభుత్వ ఆదేశాలను అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ రద్దు చేసింది. ఆదేశాలలో రోస్టర్‌ను గుర్తించి నియామక ప్రక్రియ చేపట్టిన అన్ని నియామకాలకు గెజిట్‌పైనా ట్రిబ్యునల్ తీర్పు పరిణామం చూపింది. దీంతో ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది.

కాగా అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ తీర్పుపై రాష్ట్రప్రభుత్వం హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను నవంబరు 4న ధర్మాసనం నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది. అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ తీర్పును ఎత్తిచూపితే ఇటీవల జరిపిన పదోన్నతులు, నియామకాలపై ప్రభావం చూపనుంది. 2022 లో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చేపట్టిన అన్నిగెజిట్‌లను పరిశీలిస్తే దీని తీవ్రత తెలియనుంది. 56శాతం రిజర్వేషన్‌కు అనుగుణంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న నియామక ప్రక్రియకు బ్రేక్ పడే అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెట్టి కొత్త రోస్టర్ పాయింట్ ప్రకారం కల్పించిన పదోన్నతులపైనా ప్రభావం చూపనుంది. తెలంగాణకు సంబంధించి సుప్రీంకోర్టులో తీర్పు వచ్చాక ప్రభుత్వం అయోమయంలో పడింది.

50 శాతం మించరాదు : సుప్రీం కోర్టు

సుప్రీం పొరుగున తెలంగాణ రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచుతూ తీసుకున్న పరిణామంపై సుప్రీంకోర్టు ధర్మాసనం రెండు రోజులక్రితం బుధవారం మహత్తరమైన ఆదేశాలు జారీ చేసింది. మొత్తం రిజర్వేషన్ల శాతం 50కు పెంచరాదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఇది తెలంగాణ ప్రభుత్వానికి మాత్రమే ఇచ్చిన తీర్పు అని భావించడానికి లేదు. ఇతర ఏ రాష్ట్రాలకైనా సుప్రీంతీర్పు ఇదే తరహాలో ఉంటుంది. తెలంగాణలో ఓబీసీ రిజర్వేషన్లు 42శాతానికి పెంచుతూ అక్కడి ప్రభుత్వం ఓ చట్టం తీసుకొచ్చింది. దీంతో మొత్తం రిజర్వేషన్లు 67శాతానికి పెరిగాయి. ప్రభుత్వ నిర్ణయంపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు బ్రేక్ పెట్టింది. 67శాతం రిజర్వేషన్లు సరికాదని ధర్మాసనం తేల్చింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అక్కడ విచారణ జరిపిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసి 50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే హైకోర్టు ఆదేశాలను పాటించాలని సూచించింది. ఈ పరిణామం కర్ణాటకపైన కూడా పడనుందనడంలో సందేహం లేదు.

ప్రియాంకను ఒంటరిని చేశారు.!



- ఆర్ఎస్ఎస్‌పై తిరగబడుతున్నా.. మంత్రులు మద్దతు ఇవ్వడం లేదు
- మల్లికార్జున ఖర్గే

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్‌ను వ్యతిరేకించారని తన కుమారుడు ప్రియాంకఖర్గేను ఒంటరి చేశారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. శనివారం సదాశివనగర్‌లోని మల్లికార్జున ఖర్గే నివాసానికి డీసీఎం డీకే శివకుమార్ వెళ్లారు. ఖర్గే ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇదే సమయంలోనే మల్లికార్జున ఖర్గే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇటీవల పరిణామాలు సమంజసంగా లేవంటూనే ప్రియాంక ఖర్గే ఆర్ఎస్ఎస్‌ను నియంత్రించాలని ముఖ్యమంత్రికి లేఖ రాసిన తర్వాత వ్యక్తిగతంగా తీవ్రమైన బెదిరింపులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం మౌనంగా ఉందని ఒక్క మంత్రి కూడా బహిరంగంగా ప్రియాంకకు మద్దతు ఇవ్వలేదని తీవ్రంగా బాధపడినట్లు తెలుస్తోంది. మంత్రులు ఎందుకు ఖండించడం లేదన్నారు. గోడపై దీపంలా మంత్రులు వ్యవహరిస్తున్నారని మండిపడినట్లు తెలుస్తోంది. రాష్ట్రప్రభుత్వం గ్యారెంటీలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వరాదని, ఎన్నికల ప్రణాళికలపై కూడా దృష్టి సారించాలని సూచించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో నాయకత్వ మార్పు అంశంపై పదే పదే విమర్శలు చేస్తున్నా నోటీసులతో సరిపెట్టుకుంటున్నారని, క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఖర్గే సూచించినట్లు సమాచారం. ఖర్గే ఆసుపత్రినుంచి డిశ్చార్జ్ అయి పది రోజులైంది. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారు. అయితే డీకే శివకుమార్ భేటీ తాజా రాజకీయాలలో హాట్‌టాపిక్‌గా మారింది.

ప్రైవేట్ నియంత్రణకు ప్రత్యేక జీఓ

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ సంఘసంస్థలు, సంఘాలు ప్రభుత్వ స్థలాల వినియోగాన్ని నియంత్రించడానికి సంబంధించి శనివారం ప్రత్యేక జీఓ విడుదల చేశారు. ఈనెల 16న మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా జీఓను రూపొందించినట్లు ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ (లా అండ్ ఆర్డర్) అర్చన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, కార్పొరేషన్‌ల పాఠశాల, కళాశాలలు, ఎయిడెడ్ విద్యాసంస్థలు, ఉద్యానవనాలు, క్రీడా మైదానాలు, బహిరంగ ప్రదేశాలు ప్రజల వినియోగానికి ఉద్దేశించినవన్నారు. రాష్ట్రంలో పలు ప్రైవేట్ సంస్థలు, సంఘాలు తమ కార్యకలాపాలు, ప్రచారం, ట్రైనింగ్, ఉత్సవం, సభ్యుల, మద్దతుదారుల సమావేశాలకోసం ప్రభుత్వ ఆస్తులు, భూములు, క్రీడామైదానాలు, రోడ్లు ఇతర ప్రదేశాలలో ముందస్తు అనుమతి లేకుండా కొనసాగిస్తున్నాయని వీటికి అడ్డుకట్ట వేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆదేశాలలో పేర్కొన్నారు.



హాసనాంబ దేవి మూలవిరాట్టు

హాసనాంబ సన్నిధిలో భక్తుల సందడి

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హాసనాంబదేవి దర్శనానికి భక్తులు తరలివస్తున్నారు. వారాంతం కావడం అందుకు తోడు దీపావళి పండుగ సెలవులు ప్రారంభం, శక్తి పథకం ఉండడంతో ఎన్నడూ లేనంతగా ప్రత్యేకించి మహిళలు వస్తున్నారు. అకస్మాత్తుగా వాహనాల రద్దీ పెరగడంతో హాసన్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్‌జామ్ పెరిగిపోయింది. హాసన్ జిల్లాధికారి లతాకుమారి మాట్లాడుతూ శుక్రవారం ఒక్కరోజే సుమారు 4లక్షలమంది భక్తులు దర్శించుకున్నట్లు అంచనా వేస్తున్నామన్నారు. వెయ్యి రూపాయలు, రూ.300 దర్శనం క్యూలైన్‌లు పూర్తిగా నిండిపోయాయన్నారు. నాలుగురోజులక్రితం తాను సర్వదర్శనం చేసుకున్నానని అప్పుడు 3 గంటల సమయం పట్టిందన్నారు. ఉదయం 7గంటలకు క్యూలోకి వచ్చినవారు సాయంత్రం 4 గంటలకు కానీ దర్శనం పూర్తి కావడం లేదన్నారు. ఆలయం వెలుపల కిలోమీటర్ల కొద్దీ క్యూ ఉండడంతో కొన్నిచోట్ల తోపులాట జరిగిందన్నారు. ఇప్పటిదాకా 15.50 లక్షలమంది అమ్మవారిని దర్శించుకున్నారన్నారు. భక్తుల రద్దీ నియంత్రణ పోలీసులకు సవాల్‌గా మారిందన్నారు. ప్రతి నిమిషానికి సుమారు 150మంది దర్శించుకుంటున్నారన్నారు. భక్తులు పోలీసులు, అధికారులకు సహకరించాలని కోరారు.



ప్రధాన ద్వారం వద్ద బారులు తీరిన భక్తులు

దేవెగౌడను పరామర్శించిన
శ్రావణబెళగోళ స్వామీజీ

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడను శ్రావణబెళగోళ అభినవ చారుకీర్తి భట్టారక పట్టాచార్య స్వామీజీ శనివారం పద్మనాభనగర్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. ఆయనకు మరింత ఆయురారోగ్యాలు భగవంతుడు అందించాలని స్వామీజీ ఆకాంక్షించారు.



పరామర్శిస్తున్న అభినవ చారుకీర్తి భట్టారక పట్టాచార్య స్వామీజీ

మార్కెట్లో దీపావళి సందడి



బాణసంచా కొంటున్న వినియోగదారులు



పూజా సామగ్రి కొంటున్న మహిళలు

రాయచూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. నరకచతుర్దశి, దీపావళి అమావాస్య, కార్తికపాడ్యమి పేర్లతో ఇక్కడి ప్రజలు మూడు రోజుల పాటు పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు పండుగ సరకులు, బాణసంచా, బట్టలు, కూరగాయలు వంటివి కొనేందుకు ఏకకాలంలో గుమిగూడడంతో ఆయా దుకాణాల వద్ద విపరీత రద్దీ ఏర్పడింది. దీపావళి ప్రత్యేకతతో పాటు, కార్తీక మాసం అసాంతం దీపారాధన చేయడం హిందువుల ఆనవాయితీ. దీంతో మహిళలు కొత్త కొత్త రకాల దీపాల ప్రమిదలను కొనేందుకు అమిత ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందుకనుగుణంగానే గత 10 రోజుల క్రితం నుంచే పలువురు వ్యాపారులు రకరకాల ఆకృతులలో ఉన్న దీపపు ప్రమిదలను అమ్మకానికి సిద్ధం చేసి ఉంచారు. మార్వాడి వ్యాపారస్తులు, కుటుంబాలు అధికంగాగల నగరంలో, దుకాణాల పూజలు చేయడం ఎక్కువే. దీంతో పూలు, పండ్ల ధరలకు అమాంతంగా రెక్కలొచ్చాయి. ఇక ముఖ్యంగా పిల్లలు అధికంగా ఇష్టపడే బాణసంచా ధరలు సామాన్యులకు అందనంత ఎత్తులో ఉన్నాయని, వినియోగదారులు వాపోతుండగా, జిల్లాలో నెల కొన్న అతివృష్టి నేపథ్యంలో , అమ్మకాలు ఆశించినంతగా లేవని వ్యాపారులు పెదవి విరుస్తున్నారు. కాగా దీపావళి పండుగను పురస్కరించుకొని నగరంలోని పలు దేవాలయాలను నిర్వాహకులు అందంగా అలంకరించారు. అలాగే దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల నిర్వాహకులు విద్యుత్‌లైట్లు, మామిడి ఆకులు, అరటి గెలలు, పూలు, పండ్లలతో లక్ష్మీదేవికి నైవేద్యంగా పెట్టి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

విష్ణువర్ధన్ మండపానికి పూర్వవైభవం

- పునరుద్ధరిస్తామని మంత్రి అహ్మద్ ఖాన్ హామీ



ప్రసంగిస్తున్న మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్

విజయనగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఐపీడీ సాలప్ప కాలనీ వీఎస్‌గార్డెన్‌లో ఉన్న సాహససింహ డాక్టర్ విష్ణువర్ధన్ కల్చరల్ సేవా ట్రస్టు 15వ వార్షికోత్సవంలో భాగంగా విష్ణువర్ధన్ మండపాన్ని పునరుద్ధరిస్తానని మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ హామీ ఇచ్చారు. శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో విష్ణువర్ధన్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి మాట్లాడారు. మండపం పునఃనిర్మాణానికి రూ.15-16 లక్షలు ఖర్చు కానుందన్నారు. నిధులతో పనులు పూర్తి అయ్యేలా చూస్తానన్నారు. అనంతరం లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి ఆలయ అభివృద్ధికి రూ.50వేలు అందచేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ యువనాయకులు సీఆర్ రవిప్రసాద్, మైనారిటీ అభివృద్ధి మండలి చైర్మన్ టీకే అల్తాఫ్‌ఖాన్, రిజ్వాన్, అహ్మద్, స్లంబోర్డు సభ్యుడు వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

విడాకులు ఇచ్చినా వదల్లేదు

- ఒంటరిగా జీవిస్తున్న భార్యను హతమార్చిన కానిస్టేబుల్

బెంగళూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు... అయినా అనుమానంతో రోజూ భార్యను వేధించేవాడు. దీంతో విసుగుచెందిన ఆమె విడాకులు ఇచ్చింది... అయినా వదలకుండా హతమార్చాడు. వివరాలిలా. బెళగావి జిల్లా బైలహొంగల తాలూకా బెళవాడి గ్రామానికి చెందిన కాశమ్మ నెల్లికట్టి (34) సవదత్తి కేఎస్ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేసేవారు. 13ఏళ్లక్రితం కాగవాడ తాలూకా బనజవాడ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ సంతోష్ కాంబళెను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ప్రారంభంలో వైవాహిక జీవనం సజావుగా సాగినా కొంతకాలానికి అనుమానంతో మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. విడాకులు కోరుతూ బైలహొంగల కోర్టులో దరఖాస్తు చేసుకుంది. తర్వాత తల్లిదండ్రులకు భారం కారాదని సవదత్తి పట్టణంలోని అద్దె ఇంట్లో ఉండేది. ఏప్రిల్ 5న కోర్టు విడాకులు మంజూరు చేసింది. దీని తర్వాత కూడా సంతోష్ ప్రతిరోజూ కాశమ్మకు ఫోన్ చేసి అశ్లీలంగా తిట్టేవాడు. ఈనెల 13న కాశమ్మ ఇంటికి వెళ్లి గొడవపడ్డాడు. ఈ సందర్భంగా భార్య గొంతు, కడుపుపై చాకుతో పొడిచి అక్కడనుంచి పరారయ్యాడు. మూడురోజుల తర్వాత కాశమ్మ ఇంటినుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహన్ని బిమ్స్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకున్న సవదత్తి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



సంతోష్, కాశమ్మ (ఫైల్)

నవంబరు 23న కెనరాబ్యాంకు మారథాన్



టీ షర్టుల విడుదలలో కెనరా బ్యాంకు సీఎండీ కె. సత్యనారాయణరాజు, ఈడీ తదితరులు

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజలలో ఆరోగ్యం, జీవన శైలిలో మార్పు తీసుకురావాలనే ఆలోచనతో కెనరాబ్యాంకు మూడో విడత మారథాన్ నిర్వహిస్తున్నట్టు సీఎండీ కే సత్యనారాయణరాజు తెలిపారు. శనివారం కెనరాబ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మారథాన్ టీ షర్టులను లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రజలలో ఐక్యత, ఆరోగ్యం, సంతోషకరమైన జీవనశైలి పట్ల అవగాహన పెంచాలనే మారథాన్ నిర్వహిస్తున్నామన్నారు. నవంబరు 18న కెనరాబ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం నిర్వహిస్తామని, 23న ఆదివారం మారథాన్ ఉంటుందన్నారు. 3కే, 5కే, 10కే కిమీ పరుగుల పోటీ ఉంటుందన్నారు. అన్నివయసులవారు పాల్గొనేలా పోటీలు ఉంటాయన్నారు. సీనియర్ సిటిజన్‌లు, కుటుంబ సభ్యులతో కలసి పరుగెత్తే ఆనందాన్ని పొందవచ్చునన్నారు. గత ఏడాది 10వేల మంది పాల్గొన్నారని ఈసారి అంతకుమించి వస్తారని ఆశిస్తున్నామన్నారు. రిజిస్టర్ చేసుకునేందుకు వెసలుబాటు కల్పించామన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలాన్నారు. మారథాన్ అంటే కేవలం పరుగెత్తడమే కాదని ఆరోగ్యకర, ఏకీకృత భారత్‌ను ప్రకటించే సందేశం అన్నారు. కంఠీరవ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామని ఈలోగా రిజిస్టర్ చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థిని హత్య కేసులో నిందితుడి అరెస్టు

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రేమ నిరాకరించిందని బీ ఫార్మా విద్యార్థిని యామిని ప్రియను మంత్రిమాల్ వెనుకభాగంలోని రైల్వే ట్రాక్ వద్ద కిరాతకంగా హత్యచేసిన విఘ్నేశ్‌ను శ్రీరాంపుర పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. విద్యార్థిని కళ్లల్లో కారంపొడి చల్లి చాకుతో పొడి హత్య చేసిన విషయం తెలిసిందే. నిందితుడు విఘ్నేశ్ (28)తోపాటు అతడికి సహకరించిన హరీశ్(36)ను అరెస్టు చేశారు. సోలదేవనహళ్ళిలో విఘ్నేశ్ ఉన్నట్టు తెలుసుని పథకం ప్రకారం అరెస్టు చేశారు.

ఓటు చౌర్యం ఆరోపణలపై
కొనసాగుతున్న విచారణ

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓటు చౌర్యం అంశం శబ్దం లేకుండా కొనసాగుతోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపణలతో విచారణకు సిట్ రంగంలోకి దిగిన విషయం విదితమే. ఇది ప్రతిపక్ష బీజేపీకి చుట్టుకుంటోంది. కలబురగి జిల్లా ఆళంద నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత సుభాష్ గుత్తేదార్ నివాసంపై సిట్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఓటు చౌర్యంపై అంశాలు వెలుగుచూస్తున్నాయి. సుభాష్ గుత్తేదార్‌కు చెందిన బార్ అండ్ రెస్టారెంట్‌లో ఓటరులిస్టు బయటపడినట్లు తెలుస్తోంది. ఓటరులిస్టుకు సంబంధించిన రికార్డులను కాల్చివేసిన వివాదంలో నగదును పోలీసులు స్వాధీనం చేసుకోగా డ్రైవర్ విశాల్ పరారయ్యాడు. అతడికోసం గాలింపులు చేపట్టారు. ఒక కాల్‌సెంటర్ ద్వారా ఫాం నెంబరు 7ను ఉపయోగించుకుని ఓటరును డిలీట్ చేసేవారని గుర్తించారు. కాల్‌సెంటర్‌కు చెందిన అక్రమ్, అశ్వాక్, అస్లాం సహా నలుగురిని అరెస్టు చేశారు. ఓటు చౌర్యంకు సంబంధించి బార్‌లో 7సార్లు మీటింగ్ జరిగిందని గుర్తించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.75	1631.93
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	5.183	36,910
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,202	36,799
నీటి నిల్వ (టీఎంసీలు)	78.97	101.50


అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

సీపీఆర్‌పై అవగాహన

బళ్లారి సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ సప్తాహ(వారోత్సవం) సందర్భంగా నగరంలోని కేఎస్ ఆర్‌టీసీ బస్టాండులో సీపీఆర్ సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. విలువైన ప్రాణాలను కాపాడటటానికి సీపీఆర్ సహాయపడుతుందని రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి షకీబ్ అన్నారు. శుక్రవారం నగరంలోని కేఎస్ఆర్ టీసీ బస్టాండులో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, బళ్లారి కర్ణాటక ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల యువత, ప్రజల్లో గుండె పోటు కారణంగా మరణాల సంఖ్య అధికంగా మారిందన్నారు. గుండెపోటు కానీ చాతి నొప్పితో బాధపడుతున్న వ్యక్తి ఆసుపత్రిలో చేర్చే ముందు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడినప్పుడు సీపీఆర్ చేసి కాపాడ వచ్చన్నారు. ఈకార్యక్రమం అక్టోబరు 13 నుంచి 17వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈసందర్భంగా శ్రీమతి ఉమామహేశ్వరీ, అశోక్‌జైన్, బళ్లారి డివిజనల్ కంట్రోలర్ సీనియర్ డిపో మేనేజర్ అహ్మదీన్ బగన్, కేఎస్ఆర్‌టీసీ కార్మికులు, వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో అధిక లాభాలు: ఏడీ

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళలు చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించడం ద్వారా ఆదాయాన్ని పొంది ఆర్థికాభివృద్ధి పొందవచ్చని, అందులో వ్యవసాయ ఆధారిత, చేపల వ్యాపారం, ఉద్యానవన పంటలు అమ్మడం ద్వారా ఆదాయాన్ని పొందవచ్చని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ఎస్. మంజునాథ్ సూచించారు. నగరంలోని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాయం సభాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖ ఆత్మ నిర్భర యోజన కార్యక్రమం నిర్వహించారు. కిసాన్ దివస్ సందర్భంగా బళ్ళారి, కురుగోడు తాలూకా మహిళా స్వసహాయ సంఘాలకు నైపుణ్యాభివద్ధి, బలవర్ధన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు చిన్న చిన్న సంఘాలుగా ఏర్పడి వ్యవసాయ శాఖ నుండి లభించిన పీఎంఎఫ్ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ నదాఫ్ మాట్లాడుతూ రైతు మహిళలు కేవలం ఇంటిపనులకే పరిమితం కాకుండా ఇంటి ఖర్చులకు అవసరమయ్యే చిన్న తరహా పరిశ్రమలైన పసుపుపొడి తయారీ, గులాబ్ జామ్ పొడి తదితర వాటిని తయారు చేయవచ్చన్నారు. వాటికి ఒక బ్రాండ్ పెట్టి తమతమ గ్రామాల్లోనే ఇంటింటికి వెళ్ళి అమ్మడం ద్వారా మహిళల్లో డబ్బు సంపాదనతో పాటు పొదుపు చేసి ఆర్థిక సాధికారత సాధించవచ్చన్నారు. మహిళలు సమైక్యంగా ఏదైనా సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా పాలనాధికారి కవితా, వ్యవసాయ అధికారి సౌమ్య, రేఖ, జ్యోతి, గాయిత్రి, అరుణ, స్వసహాయ సంఘల సభ్యులు, అధికార సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణ శిబిరంలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు

ఇంక్యుబేషన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

వాణిజ్య మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ నాగిరెడ్డి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న యశ్వంత్‌రాజ నాగిరెడ్డి

బళ్లారి సిటీ,అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వ్యాపారాలు, ఉద్యోగాలు పెంచడానికి అవసరమైన మూలధనం , సాంకేతికత మార్కెట్ , మానవ వనరులపై మార్గదర్శకత్వం అందించడానికి ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ సెంటర్‌ను సదినియోగం చేసుకోవాలని బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ నాగిరెడ్డి అన్నారు. శనివారం బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి ఆడిటోరియంలో జరిగిన 'లీన్‌ప్రాజెక్టు సీ, జీరో డిఫెక్ట్ జీరో వేస్ట్(లీన్) ఎగుమతి అనే అంశంపై ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి పరిశ్రమ ప్రతిరోజు ప్రతి క్షణం సవాళ్లను ఇబ్బందులను ఎదుర్కోవడం సహజం. మా ఇంక్యుబేషన్ సెంటర్ అటువంటి సవాళ్లను పరిస్థితులను విజయవంతంగా ఎదుర్కోవడానికి పరిశ్రమలో విజయం సాధించడానికి జ్ఞానం , నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుంది. ఈవ్యవస్థను అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి వాణిజ్య పరిశ్రమలకే పరిమితమైన సంస్థ కాదని, అందరి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తోందన్నారు. సంస్థ సమాజంలోని ప్రతి ఒక్కరినీ అదుకుంటోందని, ఈవిషయంలో ఎగుమతి సలహా, ఉత్పత్తి నాణ్యత, మార్కెట్ ఇతర విషయాలపై సామాచారాన్ని పొందడానికి ఇంక్యుబేషన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బళ్లారి జిల్లా పారిశ్రామిక కేంద్రం జాయింట్ డైరెక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ పరిశ్రమలు, ఉత్పత్తుల ప్రోత్సాహానికి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ వివిధ పథకాలను వివరించి 'జీరో డిఫెక్ట్‌జీరో వేస్ట్ (లీన్)ను వివరించారు.
ముఖ్య అతిథి, బళ్లారి జిల్లా పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు వి.రామచంద్ర మాట్లాడుతూ చిన్న, అతిచిన్న మధ్య తరహా సంస్థలు అత్యధిక ఉపాధిని సృష్టిస్తన్నాయని, నిరంతరం ఉద్యోగ కల్పనలో పాల్గొనే సంస్థలు వివిధ కార్యక్రమాలు, సంస్థలు అందించే సలహాలు, సూచనలన తీసుకొని విజయం సాధించాలన్నారు. జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం గౌరవ కార్యదర్శి సి.సురేశ్‌బాబు, బళ్లారి జిల్లా కాటన్ మిల్లుల సంఘం అధ్యక్షుడు దండిన్ తిప్పేస్వామి, విటీపీసీ ధార్వాడ్ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున, నింగన్న ఎస్ బిరుదార్, శివ కుమార్, కేశవమూర్తి, సంఘం గౌరవ కార్యదర్శి సురేశ్‌బాబు, జిల్లాకాటన్ మిల్లుల సంఘం అధ్యక్షుడు దండిన్ తిప్పేస్వామి, వీటీపీసీ ధార్వాడ్ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

మిరప రైతును ఆదుకోండి

- కలెక్టర్‌కు రైతు సంఘం నేతల వినతి
- బూడిద రోగంతో నష్టపోతున్నామని ఆవేదన

బళ్లారి సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మిరపపంటకు బూడిద రోగం అధికమయ్యిందని, వ్యాధి నియంత్రణ కోసం వ్యవసాయ శాఖ తగిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కర్ణాటక రైతు సంఘం రైతు హసిరు సేనా సంస్థ జిల్లాధ్యక్షుడు కృష్ణమూర్తి జిల్లాకలెక్టర్‌నుకోరారు. శనివారం రైతుసంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిరప సాగు కోసం రైతులు రూ.కోట్లు ఖర్చు చేశారని, వ్యాధి కారణంగా దిగుబడి పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. బూదిద రోగం నియంత్రణ రైతులతో సాధ్యం కావడం లేదని, వ్యవసాయ నిపుణులను వెంటనే పొలాలకు పంపి పరిశీలించి, సమస్యకు పరిష్కారం తెలియజేసేలా చూడాలన్నారు. ఈసందర్భంగా సంఘం పదాధికారులు బైలూరు వీరేశ్, మారెన్న, ఎర్రిస్వామి, అంజినప్ప, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టండి

- అధికారులకు ఎస్‌యూసీఐ వినతి


ఇంజనీర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌యూసీఐ సభ్యులు

బళ్లారి సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరం నుండి తాళూరుకు వెళ్ళే రహదారి గుడారనగరం నుండిశ్రీధరగడ్డ గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా పాడైపోయిందని శనివారం ఎస్‌యూసీఐ పీడబ్ల్యూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు వినతి పత్రం సమర్పించింది. ఈసందర్భంలో దేవదాసు, సోమశేఖర్‌గౌడ మాట్లాడుతూ గుంతల రోడ్ల కారణంగా తరచూ ప్రమాదారులు జరుగుతున్నాయని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుంతలను పూడిస్తేనే ప్రమాదాలు అరికట్టవచ్చన్నారు. రెండేళ్లుగా నగరంలో సమస్య తీవ్రంగా మారిందన్నారు. పలుమార్లు డిమాండ్ చేసినా ఫలితం శూన్యమన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని ఈ సందర్భంగా కార్యదర్శి దేవదాస్, సభ్యులు సోవశేఖర్‌గౌడ, హనుమంతప్ప, జగదీశ్ నేమకల్, నింగరాజు, టీ.ప్రమోద్ తదితరులు అన్నారు.

టేబుల్ టెన్నిస్ విజేతలకు బహుమతుల ప్రదానం

బళ్లారి రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం సాధ్యమని బళ్లారి నగరంలో పోలీసు జిమ్ఖాన్ ట్రెజరర్ కాత్రా సతీష్ కుమార్ అన్నారు. శనివారం ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ నిర్వహించిన టెన్నిస్ టోర్నమెంట్ విజేతలకు అవార్డులు ప్రధానం చేసి ఆయన మాట్లాడారు. అక్టోబరు 10 నుంచి 18 వరకు జరిగిన 16 బాలుర, బాలికల టెన్నిస్ టోర్నీలో బాలికల సింగిల్స్‌లో విజేతగా నిలిచారు. తరుణ్ రన్నరప్‌గా ఎంపికయ్యారు. పురుషులు డబుల్ స్లో షెడ్డు కెంపెగౌడ రన్నర్లుగా తరుణ్, 16 యేళ్లలోపు బాలికల సింగిల్స్‌లో ఆల్ ఇన్ మరియం సీ విజేతగా ఎంపిక కాగా లేఖ్యశ్రీ రన్నర్లుగా ఎంపికయ్యారు. బాలికల డబుల్ స్లో సాహిత్య, ఐలిస్ ఎంసీ రన్నరప్‌గా ఎంపికయ్యారు. ప్రీతి కుషీర్ రన్నరప్‌గా ఎంపికయ్యారు. ఈ అవార్డులను జిమ్‌ఖానియం ట్రెజరర్ సతీష్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు స్టోర్ సెక్రెటరీ శివనాయక్, మాజీ అధ్యక్షులు జితేంద్ర, టెన్నిస్ కోర్టులు సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


షీల్డ్, సర్టిఫికెట్లు అందజేస్తున్న కోచ్ సతీష్ కుమార్

'పది'లో ఉత్తమ ఫలితాలు రావాలి

- డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురంవిద్య, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను ముందు వరుసలో నిలపాలని టీచర్లకు డీఈఓ ప్రసాద్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ సమావేశాన్ని డీఈఓ ఆకస్మికంగా పరిశీలించారు. క్లస్టర్ పరిధిలో ఎన్ని స్కూళ్లు ఉన్నాయి, ఎంత మంది టీచర్లు ఉన్నారు, సమావేశానికి ఎంత మంది హాజరయ్యారు తదితర అంశాలను రికార్డుల ఆధారంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. గతేడాది అనుకున్న స్థాయిలో పదో తరగతి ఫలితాలు రాకపోవడంతో వెనుక స్థానంలో ఉండిపోయామని తెలిపారు. ఈసారి ఇప్పటి నుంచే పిల్లలకు బాగా చదువుచెప్పి ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లా పేరును ముందువరసలో నిలపాలని పిలుపునిచ్చారు. ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: డాక్టర్ అబ్దుల్లా

నిల్వ ఉంచిన నీటిని పరిశీలిస్తున్న వైద్య బృందం

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజలు తాము నివసించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, నీటి నిలువలు ఎక్కువ రోజులు ఉంచకుండా జాగ్రత్తలు తీసుకుంటూ డెంగీ జ్వరం సోకకుండా చూసుకోవచ్చని డాక్టర్ అబ్దుల్లా సూచించారు. శనివారం బళ్ళారి నగరంలోని బ్రూస్‌పేట పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వ్యాప్తిలో వచ్చే ప్రాంతాలు, కోట ప్రాంతంలోని 39వ వార్డులో ఆయన ఇంటింటికి తిరిగి డెంగీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల్లో డెంగీ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుపుతూ అవసరాల కోసం ఇళ్ళలో నిలువ చేసుకు నీటి ట్యాంకులు వారానికి ఒకరసారైనా శుభ్రం చేయాలన్నారు. ఈ సందర్భంగా 39వ వార్డు కార్పొరేటర్ శశికళ, వైద్యాధికారి డాక్టర్ సురేఖ, ఎన్.వి.బిడిసిపి సలహా దారులు ప్రతాప్, జిల్లా నోడల్ అధికారి నందిని, ఆరోగ్య పర్యవేక్షకులు నాగేంద్రప్ప, మరి బసవనగౌడ, రవీంద్ర జినగ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్


వార్డుల్లో సమస్యలపై ఆరా తీస్తున్న మేయర్ సత్య

వార్డుల్లో మేయర్ పర్యటన

హోసూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ మేయర్ సత్య నగరంలోని పలు ప్రాంతాలలో శనివారం పర్యటించారు. 26వ వార్డులోని పార్వతినగర్, చుట్టుపక్కల ప్రాంతాలలో స్వయంగా పరిశీలించారు. వీధిదీపాలు, రోడ్లు, మురుగుకాలువలు కల్పించాలని వినతులు అందచేశారు. కమిషనర్ షబ్బీర్ ఆలం, నగర సంక్షేమ అధికారి డాక్టర్ అజిత, జోనల్ కమిటీ చైర్మన్ రవి, కౌన్సెలర్ శిల్పా శివకుమార్ తదితరులు ఉన్నారు.

నగరంలో ట్రాఫిక్ కష్టాలు


నగరంలోని ఫ్లైఓవర్ వద్ద ఆగిపోయిన వాహనాలు

హోసూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని వివిధ ప్రాంతాల కార్మికులతోపాటు సరిహద్దులోని బెంగళూరునుంచి ప్రజలు తమ సొంత ప్రాంతాలకు బయల్దేరడంతో నగరంలో ఎటుచూసినా ట్రాఫిక్‌రద్దీ నెలకొంది. వారాంతం, పండుగల వేళ ట్రాఫిక్‌జామ్ ఇక్కడ సామాన్యంగా ఉంది. దీపావళి పండుగ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాలలోని జూజువాడి నుంచి పెరండపల్లి అటవీప్రాంతవ వరకు పలు చోట్ల వాహనాల రద్దీతో ఆగిపోయాయి. నగరంలోని సిప్‌కాట్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, బస్టాండ్, పాత మునిసిపాలిటీ, రాయకోట్టై రోడ్డు సర్కిల్ సహా పలు చోట్ల రద్దీ నెలకొంది.

చారిత్రక పోరాటానికి కేంద్రం దిగి రావాల్సిందే

రాయచూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం సాగుతున్న చారిత్రక పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగి రావాల్సిందేనని ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డాక్టర్ బసవరాజ్ కళస అన్నారు. రెండున్నర ఏళ్లుగా నిరవధిక సమ్మె కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం రాయచూరుకు ఎయిమ్స్ మంజూరు చేయకుండా జాప్యం చేస్తుండడం ఆశ్చర్యకరమన్నారు. నగరంలోని మహత్మ గాంధి స్టేడియంలో నిర్వహిస్తున్న ఎయిమ్స్ నిరవధిక సమ్మె దీక్ష శిభిరంలో శనివారానికి 1255వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ బసవరాజ్ కళస, ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికగా ఉన్న ఎయిమ్స్‌ను మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులేమో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా ఎయిమ్స్ మంజూరుకు సమ్మతించిన ప్రజాప్రతినిధులు ఆ దిశగా ఎందుకు ప్రయత్నం చేయడం లేదని నిలదీశారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం నాయకులందరూ ముఖ్యంగా ఇక్కడి ప్రజాప్రతినిధులు తమవంతు పాత్ర పోషించాలని డిమాండ్ చేశారు.

250 మందికి ఇంటి పట్టాల పంపిణీ


లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కంప్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరిజన కాలనీలో అనేక దశాబ్దాలుగా నివసిస్తున్నా ఇళ్లు లేని 240 మంది కుటుంబాలకు ఎమ్మెల్యే గణేష్ శనివారం ఇంటి పట్టాలు అందజేశారు. పట్టణంలోని 4వ వార్డు ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల సమీపంలో హౌసింగ్ శాఖ కర్ణాటక మురికివాడ అభివృద్ధి బోర్డు బళ్లారి ఉప విభాగం ఆధ్వర్యంలో పట్టాల పంపిణీ కార్యక్రమంచేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హరిజన కాలనీలో సుమారు 60 యేళ్ల నుంచి నివసిస్తున్నారని, వారికి చాలా కాలంగా ఇళ్ల పట్టాలు లేవన్నారు. అయితే ఇప్పుడు వారికి ఇళ్ల పట్టాలు లభించడం వల్ల ప్రభుత్వ సౌకర్యాలను పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు బట్ట ప్రసాద్, ఉపాధ్యక్షులు సుశీలమ్మ, కౌన్సిలర్లు చాంద్ బాషా, నాగమ్మ, సత్యప్ప, సీఆర్ హనుమంతు, లడ్డా వన్నూరు వలీ, తిమ్మన్న, నాయకులు సత్యప్ప, సుధీర్, సిద్దప్ప, ఆటో రాఘవేంద్ర, కనరాజప్ప, యల్లప్ప, గణేష్, తిమ్మన్న, రాజన్న, వన్నూరుసాబ్‌తో పాటు పాల్గొన్నారు.

పేదలకు ఫామ్-3 సౌకర్యం కల్పించాలి

స్థాయీ సమితి అధ్యక్షుడు రాజశేఖర్

కంప్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో నివసిస్తున్న గ్రామస్థాయి ప్రజలకు ఫామ్ నంబర్ 3 కల్పించాలని స్థాయి సమితి అధ్యక్షులు రాజశేఖర్ తెలిపారు. కుడితిని పట్టణంలో పట్టణ పంచాయతీ ప్రాంగణంలో అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు పట్టణంలో నివసించే కుటుంబాలకు ఫారం నంబర్ 3 ఇవ్వడానికి వెనుకంజ వేస్తున్నారు. రియల్ ఎస్టేట్ చేపట్టే వారికి మాత్రం త్వరగా ఫారమ్ నంబర్ 3 ఇస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కుడితిని పట్టణ పంచాయతీలో చాలా అవకతవకలు జరుగుతున్నాయని వెంటనే దర్యాప్తు నిర్వహించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో దాఖలును దృష్టిలో వుంచుకుని కొత్త దాఖల ప్రకారం కాకుండా పంచాయతీ దాఖలు ప్రకారమే ఆ కుటుంబాలకు ఫారం త్రీ కల్పించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వారితో పాటు ఇతర అంశాలపైన కూడా చర్చించబడ్డాయి. పట్టణ పంచాయతీ ఏర్పడిన అనంతరం మొదటి అధ్యక్షులుగానే కార్యాలయం ప్రాంగణంలో సమావేశాలు ప్రారంభించాం. ఈ శనివారం జరిగిన చివరి సమావేశంలో కూడా తమ స్థాయి సమితి అధ్యక్షత ఆధ్వర్యంలోనే చివరి సమావేశం జరిగినందుకు తాము ఎంతో సంతోషం వ్యక్తపరుస్తున్నామని తెలిపారు. చివరకు వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు సుజాత, సత్యప్ప, ఉపాధ్యక్షురాలు పంపాపతి కనకేరి, చీఫ్ ఆఫీసర్ తీర్థప్రసాద్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ తాయమ్మ, శారద, శివలింగప్ప కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్థాయీ సమితి అధ్యక్షుడు రాజశేఖర్

నేలకొరిగిన వరి పైరు


వరి పైరును కట్టలుగా కడుతున్న కూలీలు

కంప్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు, ఈదురు గాలులకు వరి పంటలు నేలకొరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. కంప్లి తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు నెల్లూడి చిక్కజాగనూరు, కృష్ణనగర్ క్యాంపు, హిరే జాగనూరు తదితర గ్రామాల్లో వర్షాలతో చేతికొచ్చిన వరి పంటలు పూర్తిగా నేలకొరిగాయి. పంటలు నేలపాలవుతున్నాయి. చేతికొచ్చిన పంటలు వర్షానికి గాలులకు ఇలా వరి పంటలో నేలపాలవడంతో రైతుకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడి ఆందోళన చెందుతున్నారు. నేలకొరిగిన పంటలను కూలీల సహాయంతో ధాన్యం నేలపాలు కాకుండా దిబ్బలుగా కట్టే పంట నష్టం కాకుండా రైతులు, జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా రైతు హిరే జాగనూరు రైతు, వీరమాచనేని కుటుంబరావు మాట్లాడుతూ రైతు ఎంతో కష్టపడి పండించిన పంటలు మార్కెట్లలో రేట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటూ నష్టపోతూ అన్నింటిని ఎదుర్కొంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కానీ పొలంలో పండించేందుకు కావలసిన సామాగ్రితో పాటు రసాయనిక ఎరువులు క్రిమికీటక మందులు, కూలీల రేట్లు మాత్రం రోజురోజుకి పెరుగుతున్నాయన్నారు.. భూమిని నమ్ముకున్న రైతు ప్రత్యేక ఇబ్బందులకు గురవుతుండటంతో వ్యవసాయ రంగానికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రకృతితో పాటు నాయకులు అధికారుల వల్ల కూడా రైతులు నష్టపోతున్నామని తెలిపారు.

కాలుష్యంతో విపరీత పరిణామాలు

అనంతపురం క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వాహనాల కాలుష్యం పెరగడం వల్ల ప్రకృతిలో విపరీత పరిణామాలకు దారితీస్తోందని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి సాధుబాబు పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. తర్వాత నగరానికి చెందిన ఫెడరల్ ఫ్రెండ్స్ గ్రూప్, బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి సప్తగిరి సర్కి ల్ వరకూ ర్యాలీ కొనసాగింది. జి ల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు సైకిల్ తొక్కుతూ ర్యాలీలో స్ఫూర్తినిచ్చారు. తర్వాత ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి సాధుబాబు మా ట్లాడుతూ.. రోజురోజుకు పర్యావరణ సమతౌల్యత దెబ్బతింటోందని పేర్కొన్నారు. వాహనాల వినియోగం పెరగడంతో కాలుష్యం కూడా పెరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ రాజశేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


నేటి ప్రముఖులు
పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

సుబ్రమణ్యన్ చంద్రశేఖర్ (జయంతి)



భారతీయ సంతతికి చెందిన అమెరికన్ ఖగోళ భౌతికశాస్త్రవేత్త 'పద్మ విభూషణ్' గ్రహీత సుబ్రమణ్యన్ చంద్రశేఖర్ 1910 అక్టోబరు 19న జన్మించారు. నక్షత్రాలపై ఆయన చేసిన పరిశోధనలకు 1983లో 'నోబెల్ పురస్కారాన్ని' విలియం ఆల్ఫ్రెడ్ ఫౌలర్‌తో కలసి పొందారు. దేశంలో తొలి నోబెల్ గ్రహీత సర్ సివి రామన్ అన్న కుమారుడైన సుబ్రమణ్యన్ చంద్రశేఖర్ కూడా నోబెల్ బహుమతి పొందడం విశేషం. చికాగో యూనివర్శిటీలో సుదీర్ఘకాలం ప్రొఫెసర్‌గా పని చేశారు. 45మంది పీహెచ్‌డీ పొందేందుకు మార్గ దర్శకం చేశారు. 1995 ఆగస్టు 21న కన్నుమూశారు. మరణానంతరం భార్య లలితా చంద్రశేఖర్ ఆయన జ్ఞాపకార్థం నోబెల్ పురస్కార మొత్తాన్ని చికాగో యూనివర్సిటీకి అందజేసి మెమోరియల్ స్కాలర్ షిప్‌కు సహకరించారు.

ఇచ్ఛాపురపు జగన్నాథరావు (జయంతి)



ప్రముఖ తెలుగు కథా రచయిత ఐజే రావుగా పేరొం దిన ఇచ్ఛా పురపు జగన్నాథ రావు 1931 అక్టో బరు 19న వైజాగ్‌లో జన్మించారు. సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్ మెంట్‌లో నేరుగా క్లాస్-1 అధికారిగా నియమి తులయ్యారు. సీఈఎస్‌టీఏటీ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. కోల్కత్తా, చెన్నైలలో కస్టమ్స్ కలెక్టర్‌గా పనిచేశారు. ప్రవృత్తిగా రచనలు చేశారు. ఎదురద్దాలు, మొగలిరేఖలు, నీటిమీద దీపాలు, తుమ్మెద, గులాబి ముల్లు వంటివి పేరొం దాయి. 1991లో పదవీ విరమణ అనంతరం హైదరా బాద్‌లో స్థిరపడ్డారు. ఆయన రచించిన కథానికలు, నవలలు, నాటికలు మొత్తం 13 సంపుటాలుగా వెలువడ్డాయి. ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి పత్రికల్లో వీక్లీ కాలమ్స్ రాశారు. 1999లో తెలుగు విశ్వ విద్యాలయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. 2017 డిసెంబరు 13న కన్నుమూశారు.

సుప్రీంకోర్టు ఘటనకు నిరసనగా చామరాజనగర బంద్



చామరాజనగరలో మూతపడిన దుకాణాలు



దళిత సంఘాల నాయకుల ర్యాలీ

బెంగళూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై బూటు విసరడాన్ని ప్రయత్నించిన చర్యను ఖండిస్తూ జిల్లా కేంద్రమైన చామ రాజనగర బంద్ జరిగింది. శనివారం బంద్ చేసేలా దళిత సంఘాలు ఎస్‌డీపీ ఐ తోపాటు పలు సంఘాలు ఇటీవల వారం రోజులుగా ప్రచారం చేశా యి. అందుకు అనుగుణంగా చామరాజనగర వ్యాప్తంగా దుకాణాలు మూసి వేశారు. కేఎస్‌ఆర్టీసీ బస్సుల సంచారంలోనూ వ్యత్యాసం ఏర్పడింది. అన్ని సంఘా లకు చెందిన ముఖ్యనాయకులు చామరాజనగర వీధులలో ర్యాలీ చేశారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై బూటు విసేందుకు ప్రయత్నించిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంగా భువనేశ్వరి సర్కిల్‌లో ఆర్‌ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలకోసం ఏర్పాటు చేసిన కాషాయ జెండాలను తొలగించారు. దళితసంఘం ముఖ్యులు అయ్యణ్ణపుర శివకుమార్ మాట్లాడుతూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటలవరకు బంద్ కొనసాగుతుందన్నారు. సీజేకు జరిగిన అవమాన సంఘటనకు శుక్రవారం కోలారు జిల్లా బంద్ చేయగా శనివారం చామరాజ నగరలో బంద్ కొనసాగింది. పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నేషనల్ కళాశాలకు పూర్వవైభవం రావాలి

» మంత్రి రామలింగారెడ్డి



గురువందనలో టీచర్లకు సన్మానం

బెంగళూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): లక్షలాదిమందికి విద్యను అందించిన బసవన గుడిలోని నేషనల్ కళాశాలకు పూర్వరావాల్సి ఉందని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి ఆకాంక్షించారు. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆఫ్ కర్ణాటక ఆధ్వర్యంలో శనివారం గురువందనా కార్యక్రమం జరిగింది. మంత్రి పాల్గొని మాట్లా డుతూ కళాశాలలో విద్యతోపాటు సేవా మనో భావం ఉండడంతోనే కళాశాలకు మంచి పేరు వచ్చిందన్నారు. ఇటువంటి కళాశాలలు ప్రగతి పథంలో ముందుకు సాగాలన్నారు. గతంలో బెంగ ళూరులో హైస్కూల్ లేదా కళాశాల అంటే నేషనల్ కాలేజ్ అనే పేరుండేదన్నారు. ఇక్కడ సీటు దొరకడం కష్టంగా ఉండేదన్నారు. అయితే ఇటీవలి కాలంలో వేరే కళాశాలలు ఆ స్థానాన్ని పొందా యన్నారు. హెచ్ నరసింహయ్య కాలంలో నేషనల్ కళాశాల వైభవం తిరిగి రావాలన్నారు. ఈసారి 410మంది ఉపాధ్యాయులకు గురువందనతో గౌరవంచడంపై అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ పుట్టణ్ణ, సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ హెచ్‌ఎన్ సుబ్రమణ్య, పదాధికారులు పాల్గొన్నారు. స్థానిక ప్రముఖులు, పూర్వ విద్యార్థులు తదితరులు భాగస్వామ్యులయ్యారు.



వేదికపై సామవేదం షణ్ముఖశర్మ, కళాబృందం

అలరించిన సప్తపది కీర్తన

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలో దేవీమహాత్యం (చండీ సప్తశతి) ప్రవచనం వారంరోజులపాటు సాగింది. ముగింపులో భాగంగా శుక్రవారం బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారి సమక్షంలో సప్తపది కీర్తన భక్తులను ఆకట్టుకుంది. శివపదం కీర్తనలకు ఆయన వ్యాఖ్యానం చేయగా కలైమామణి నాదనిధి బీవీ బాలసాయి సంగీత దర్శకత్వంలో పేరొందిన శాస్త్రీయ సంగీత కళాకారులు డాక్టర్ ఆర్‌జే నందిని, ఆర్‌పీ శ్రవణ్, వినయకార్తీక రాజన్, విద్యాకల్యాణ రామన్, సాగి విఘ్నేశ్, శరత్ సంతోష్‌లు సహకారం అందించారు. పెద్దసంఖ్యలో భక్తులు శ్రోతలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో ఎమ్మెల్యే, డీజీపీ తదితరులు

దొమ్మసంద్ర, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సర్జాపుర పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రెస్టీజ్ సంస్థ సీఎస్‌ఆర్ గ్రాంట్లతో రూ.4.50కోట్లతో నూతన భవనానికి శనివారం శంకుస్థాపన చేశారు. డీజీపీ డాక్టర్ ఎంఏ సలీం మాట్లాడుతూ బెంగళూరు నగరం విస్తరిస్తోందని గ్రామీణ ప్రాంతంలోని పోలీసులకు వీలుగా ప్రిస్టేజ్ సంస్థ సహకారంతో నూతన భవనం చేపట్టడం సంతో షంగా ఉందన్నారు. ఎమ్మెల్యే శివణ్ణ మాట్లాడుతూ ఆనేకల్ తాలూకా జనాభా పెరుగుతోందని సర్జాపుర, దొమ్మసంద్ర, చందాపుర, అత్తిబెలె, ఆనేకల్ ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. పోలీసు అధికారులు డాక్టర్ అరుణ్ చక్రవర్తి, లాబూరామ్, సీకే బాబా, మోహన్ కుమార్, ప్రిస్టేజ్ సంస్థ ముఖ్యులు విజయ్ శ్రీవత్సవ్, సర్జాపుర గ్రామపంచాయతీ అధ్యక్షురాలు ఎన్ వీణా పాల్గొన్నారు.



కొలువు కలకళ!!

పేదింటి బిడ్డలకు ప్రభుత్వ ఉద్యోగాలు..
కష్టేఫలికి నిదర్శనంగా నిలిచిన యువత

నల్లమాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం.. సామాన్య, పేద, మధ్య తరగతి వర్గాల కల. దాన్ని సాకారం చేసుకునేందుకు అనేక మంది యువత నిత్యం శ్రమిస్తుంటారు. ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే ఉద్యోగ భద్ర తతో పాటు సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం దక్కుతాయి. ఇటీవల మండలంలోని పలువురు కానిస్టేబుల్, ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. ప్రయత్నలోపం లేకుండా శ్రమిస్తే విజయం వరిస్తుందనేందుకు వీరు ఉదా హరణగా నిలిచారు. మండలంలో కుటా లపల్లి గ్రామానికి చెందిన చిన్న వెంకటేష్ నాయక్, చెన్నకేశవనాయక్, దొన్నికోట గ్రామానికి చెందిన రియాజ్‌ఖాన్, పుల గంపల్లి గ్రామానికి చెందిన ఆసీఫ్‌బాషా, మసకవంకపల్లి గ్రామానికి చెందిన వెంక టరమణ, నేరాలవంకతండాకు చెందిన సంధ్య, బాసంవారిపల్లి గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. అలాగే ఎర్రవం కపల్లి గ్రామానికి చెందిన బసనగాని సుమంత్, కురుమాల గ్రామానికి చెందిన కొండె జ్యోత్స్న, పుల్లగూర్లపల్లికి చెందిన గంగప్ప ఉపాధ్యాయ కొలువులు సాధించారు. పేదరికానికి ఎదురొడ్డి నిలిచి, అచెంచల దీక్షతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విజయగాథ వారి మాటల్లోనే...

గొర్రెలు కాసి చదివించారు



మా నాన్న చంద్రానాయక్, అమ్మ లక్ష్మీదేవి. వీరు సేద్యపు పను లతో పాటు గొర్రెలు కాస్తూ నన్ను చదివించారు. మాకు రెండెకరాల పొలం ఉంది. ఆ పొలం పనులు అమ్మ చూసుకుంటుండగా నాన్న గొర్రెలు మేపేవాడు. వారి కష్టాన్ని చూసి బాగా చదివి, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని చిన్నప్పుడే నిశ్చయించుకున్నా. 1 నుంచి ఏడో తరగతి వరకు మా ఊర్లోనే ప్రభుత్వ పాఠశాలలో చదు వుకున్నా. 8 నుంచి పదో తరగతి వరకు నల్లమాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివా. ఇంటర్ కూడా నల్లమాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే పూర్తి చేశా. అప్పట్లో క్రీడా పోటీల్లో బాగా ఆడేవాడిని. ఆ ఆటలు నేను పోలీస్ ఉద్యోగం సాధనలో ఎంతగానో ఉపయోగప డ్డాయి. ఫిజికల్ ఫిట్నెస్ క్రీడల వల్లే సాధ్యమైంది. మంచిగా విధులు నిర్వహించి, నా తల్లిదండ్రులకు మంచి పేరు తెస్తా.

\- చిన్న వెంకటేష్‌నాయక్,
కుటాలపల్లి తండా

వలస వెళ్లి చదివించారు



మాది నిరుపేద కుటుంబం. నన్ను చదివించి ప్రయోజ కులను చేయడానికి మా నాన్న కృష్ణమూర్తి, అమ్మ రామ కృష్ణమ్మ అహోరాత్రులు శ్రమించారు. ఇందుకోసం వారు 13ఏళ్ల బెంగళూరుకు వలస వెళ్లి, అక్కడ గార్మెంట్స్ పని చేశారు. వచ్చిన సంపాదనతో నన్ను చదివించారు. పాఠ శాల నుంచి ఇంటర్ వరకు నా విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ విద్యాలయాల్లోనే సాగింది. టీటీసీ రాయ చోటి, బీఈడీ కర్నూలులో కన్వీనర్ కోటాలో పూర్తి చేశా. 2018లో డీఎస్సీ రాసినా రాలేదు. చాలా నిరుత్సాహం కలిగింది. అయితే అమ్మానాన్నల కష్టాన్ని తలచుకుని ఎంత కష్టమైనా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని ప్రయత్నించా. పగలు రాత్రి అదే ధ్యాసతో గడిపా. ఈక్రమంలోనే డీఎస్సీ-2025లో మెరుగైన ర్యాంకు రావ డంతో సోషియల్ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యా. నాకు ఉద్యోగం వచ్చిన విషయం తెలియగానే నా తల్లిదం డ్రులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. ప్రస్తుతం పుట్టపర్తి మండలం పెడబల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసి స్టెంట్‌గా పనిచేస్తున్నా.

\- బసనగాని సుమంత్,
స్కూల్ అసిస్టెంట్, ఎర్రవంకపల్లి

అక్కా బావ ప్రోత్సాహంతో..



మా అక్క, బావ ప్రోత్సాహంతోనే నేను కానిస్టే బుల్ ఉద్యోగం సాధించా. నాన్న జయరాం నాయక్, అమ్మ శాంతమ్మ. మాకున్న రెండు న్నర ఎకరాల వ్యవసాయ భూమిని సాగు చేస్తూ మమ్మల్ని పెంచి, చదువు చెప్పించారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు మా ఊర్లోనే ప్రభుత్వ బడిలో చదివా. 8 నుంచి పదో తర గతి వరకు ప్రైవేటు పాఠశాలలో చదువుకున్నా. ఇంటర్, డిగ్రీ అనంత పురం ప్రభుత్వ కళాశాలలో చదివా. చదువు గురించి, ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే వచ్చే మర్యాద గురించి తరచూ మా అక్క, బావ చెప్పేవారు. వారి ప్రోత్సాహంతోనే కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రయత్నాలు ప్రారం భించా. ఈక్రమంలోనే కాకినాడ శ్యామ్ ఇన్స్టిట్యూట్‌లో ఆరు నెలలు పాటు కోచింగ్ తీసుకున్నా. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లోనే ఈవెంట్స్‌తో పాటు ప్రిలిమ్స్ పూర్తి చేశా. అయితే ఎంపికైన వారందరికి ఉద్యోగాలు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అప్పట్లో దర ఖాస్తు చేసుకున్నవారందరికీ రెండుసార్లు పరీక్షలు నిర్వహించి మెరిట్ సాధించిన వారిని పోలీసు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈక్రమంలో నాకు కూడా ఉద్యోగం వచ్చింది.

\- చెన్నకేశవనాయక్, కుటాలపల్లి తండా

నా భర్తే గురువు...




నా ఉద్యోగ సాధనలో నా భర్త కొండే భానుప్రకాష్‌రెడ్డి గురు వుగా నిలిచాడు. నాకు వివాహం అయిన తర్వాత చదువు విలువ తెలియజెప్పి బాగా చదవాలని ప్రోత్సహించేవారు. ఆయన ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. నాకు తెలి యని సబ్జెక్ట్ విషయాలు ఎన్నో వివరించేవారు. ఈక్రమంలో 2018లో డీఎస్సీ రాసినా ఫలితం లేకపోయింది. అయితే నేను కుంగిపోకుండా నా భర్త అండగా నిలిచాడు. దీంతో మరింత పట్టుదల చదివి 2025లో ఎస్జీటీగా ఉద్యోగం సాధించా. ప్రస్తుతం అమడగూరు మండలం చినగానిపల్లి పాఠశా లలో సెకెండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నా. - కొండె జ్యోత్స్న, కురుమాల

పండుగకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంతకల్లు డివిజన్ మీదుగా సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకట నలో తెలిపారు. బెంగళూరు కంటోన్మెంటు-కలబురగి ప్రత్యేక రైలు (06303)ను ఈ నెల 18న, కలబురగి-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (06204)ను ఈ నెల 20న నడపనున్నట్లు తెలిపారు. బెంగళూరు కంటోన్మెంటు-కలబురగి ప్రత్యేక రైలు (06307) ఈ నెల 20న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06208) ఈ నెల 21న నడుపుతామన్నారు. బెంగళూరు కంటోన్మెంటు-కలబురగి ప్రత్యేక రైలు (0630) ఈ నెల 21న, కలబురగి-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (06210) ఈ నెల 22న నడపనున్నట్లు వివరించారు. ఈ రైళ్లు యల్హంక, హిందూపురం, ధర్మ వరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయ చూరు, క్రిష్ణా, యాదగిరి, వాడి, షాహాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తాయ న్నారు. యశ్వంతపూర్-ముజఫర్ నగర్ ప్రత్యేక రైలు (06261) ఈ నెల 22న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06262)ను ఈ నెల 24న నడుస్తాయన్నారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, డోన్, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట, రామగుండం, బాలార్షా, నాగ పూర్, ఇటార్సి, జబల్పూర్, సట్నా, ప్రయాగరాజ్ చౌకీ, పండిట్ దీన్‌ద యాళ్ ఉపాధ్యాయ స్టేషన్, బక్సర్, ఔర, దానాపూర్, పాటలీపుత్ర, సోన్‌పూర్, హాజీపూర్ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందన్నారు.

సోలార్‌తో ఆదాయం : మంత్రి సవిత



ర్యాలీలో పాల్గొన్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్‌తో ఆదాయం వస్తుందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. శనివారం సోలార్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వ హించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డెమో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ బిగించుకోవాలని తెలిపారు. సోలార్ వినియోగంతో ఎలాంటి విద్యుత్ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని, మిగులు విద్యుత్‌ను విక్రయిం చడం ద్వారా వినియోగదారులకు ఆదాయం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ రామక్రిష్ణప్ప, నాయకులు శ్రీరా ములు, గోపాల్, పోతిరెడ్డి, రామక్రిష్ణ, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, కృష్ణ మూర్తి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది అధికారికంగా ధన్వంతరి జయంతి : మంత్రి

వచ్చే ఏడాది నుంచి ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహిస్తా మని మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం స్థానిక అన్నాక్యాంటిన్‌లో నాయిబ్రాహ్మణుల ఆరాధ్య దైవమైన ధన్వంతరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మ ణులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

జర్నలిజంలో విశ్వసనీయత ముఖ్యం

ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు వృత్తిలో విశ్వసనీయత ముఖ్యమని, నిరంతరం శ్రమిం చడం వల్లనే అది సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సీఆర్ మీడియా అకా డమీ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన గ్రామీణ విలేకరుల పునశ్చరణ తరగతులు శనివారం ముగిశాయి. ఏపీయూడబ్ల్యూజే నిర్వహించిన తరగతుల్లో శిక్షణ పొందిన జర్నలిస్టులకు అకాడమీ నుంచి పత్రా లను అందించారు. క్రైమ్ రిపోర్టింగ్‌పై ఆంధ్రజ్యోతి డిప్యూటీ చీఫ్ రిపోర్టర్ శ్రీశైలం రమేష్, పత్రికా భాషపై సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ, కృత్రిమ మేధపై సీని యర్ జర్నలిస్టు కుర్రా విజయకుమార్ శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో కాలవ మాట్లాడుతూ.. నిబ ద్ధత, చిత్తశుద్ధితో జర్నలిస్టులు వృత్తికి వన్నె తేవాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు పాత్రికేయుడు అవు తున్న నేటి ఆధునిక యుగంలో సామాజిక అంశాలను కొత్తగా రాయాలని సూచించారు. సీఆర్ మీడియా అకా డమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ మాట్లాడుతూ.. రెండురో జుల పాటు జరిగిన పునశ్చరణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను విలేకరులు ఆచరణలో పెట్టాలని సూచిం చారు. ప్రతి విలేకరి నైతిక విలువలు పాటించాలని తెలి పారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బా రావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జర్నలిస్టుల అక్రిడి టేషన్ల విషయంలో కోత పెట్టిందని, ఈ ప్రభుత్వంలో అర్హులకు న్యాయం చేయాలని కోరారు. హెల్త్‌స్కీం, ఇంటి స్థలాలు వంటి సంక్షేమ కార్యక్రమాలకు అక్రిడిటే షన్ల అవసరం ఉందని తెలిపారు. విశ్రాంత జర్నలిస్టు లకు పెన్షన్ స్కీం విషయంలో అండగా ఉండాలని విప్‌ను కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండప్ప, జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ అయూబ్ పాల్గొ న్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

విశాఖకు గూగుల్.. హర్షణీయం

● మంత్రి లోకేశ్‌కు అభినందనలు ● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్



మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయిలో అత్యంత గుర్తింపు పొందిన గూగుల్ సంస్థ విశాఖపట్నంకు రావడం హర్ష ణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దేవరగుడి జగదీష్ పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గూగుల్ సంస్థను ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేయడాన్ని సీపీఐ స్వాగతిస్తోం దని అన్నారు. గూగుల్‌ను విశాఖకు తీసుకురా వడానికి చొరవచూపిన మంత్రి నారా లోకేశ్‌ను అభినందిస్తున్నామని తెలిపారు. తమ పార్టీ ప్రతిపక్షంలో ఉంటూ పోరాటాలు చేస్తున్నా.. రాష్ట్ర అభివృద్ధిని ఆకాంక్షిస్తూ మంచి పనులను ఎపుడూ స్వాగతిస్తుందని అన్నారు. గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేయడం వల్ల ఇతర ప్రముఖ సంస్థలు ఇక్కడికి రావడా నికి ఆసక్తి చూపుతాయని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కర్నూలులో హైకోర్టు బెంచ్, అనంతలో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జీఎస్టీపై ప్రధాని నరేంద్రమోదీ గోబెల్స్ ప్రచారం చేస్తు న్నారని మండిపడ్డారు. గతంలో ఇష్టారాజ్యంగా ధరలు పెంచి, ప్రజల్లో వ్యతిరేకత రావడంతో కొంత తగ్గించి గొప్పగా ప్రచారం చేసుకుంటు న్నారని విమర్శించారు. మరో రాష్ట్రనేత జాఫర్ మాట్లాడుతూ.. జీఎస్టీ ప్రచారానికి కోట్లు ప్రజా ధనం ఖర్చుపెడుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రచారం చేసేటపుడు పెట్రోల్, డీజిల్ ధరలకు జీఎస్టీ ఎందుకు వర్తింపచేయలేదని కేంద్రాన్ని ప్రశ్నించారు.